## సంతోషంగా లేనప్పుడు సంబురాలెందుకు?

### పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి

పెద్దపల్లి, డిసెంబర్3: కాంగ్రెస్ ఏడాది పాలనలో తాము సంతోషంగా లేమని ప్రజలే చెబుతున్నప్పుడు ప్రజాపాలన విజయోత్సవాల సంబురాలెందుకు నిర్వహిస్తున్నారో తెలియని పరిస్థితి రాష్ట్రంలో ఉందని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, ఈ సమయంలో రైతులు, విద్యార్థులు, ఆడబిడ్డలు, వృద్ధులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. ఏడాది కాలంలోనే కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, సీఎం ఎన్ని సభలు పెట్టినా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. హైదరాబాద్‌లోని బీఆర్‌ఎస్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అడ్డగోలు హామీలు గుప్పించిందని, ప్రజలను నమ్మించి ఓట్లు దండుకున్నదని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ధ్వజమెత్తారు. కేసీఆర్ పాలనలోనే పెద్దపల్లి జిల్లాలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరైన పనులకే కొత్తగా శంకుస్థాపన చేస్తున్నారని ఆరోపించారు. బుధవారం పెద్దపల్లికి రేవంత్‌రెడ్డి వస్తున్నారని, జిల్లా అభివృద్ధికి ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించిందో చెప్పాలని డిమాండ్ చేశారు.




మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

## గని కార్మికుల హామీలు అమలు చేయండి

### టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, డిసెంబర్ 3: సింగరేణి గని కార్మికులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. గోదావరిఖనిలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు, సింగరేణి ఎన్నికల్లో ఐఎన్టీయూసీ, కాంగ్రెస్ పార్టీ సింగరేణి కార్మికులకు 240 గజాల భూమి, కొత్త బావులకు అనుమతులు, ప్రైవేటీకరణ నిలుపుదల చేస్తామని చెప్పాయని, కానీ ఇప్పటివరకు ఏ సమస్యపైనా స్పష్టత లేదన్నారు. కార్మికుల పెరుక్స్‌పై ఆదాయపు పన్ను, సింగరేణి ఏరియాలో సూపర్ స్పెషాలిటీ దవాఖానగా మార్పు, కొత్త క్వార్టర్ల నిర్మాణంపై ఇచ్చిన హామీలపై కదలిక లేదన్నారు. అలాగే, మహిళలకు గౌరవప్రదమైన ఉద్యోగం ఇస్తామని చెప్పిన దానికి విరుద్ధంగా వారిని అన్ని పనులకు పంపేలా యాజమాన్యం నిర్ణయాలు తీసుకుంటున్నదని మండిపడ్డారు. సీఎం పర్యటన సభలో ఈ హామీలపై ప్రకటన చేయాలని కోరారు. సమావేశంలో టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, నూనె కొమురయ్య, వడ్డెపల్లి శంకర్, చెల్పూరి సతీశ్, ఇందూరు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, మాసాడి సాయిచరణ్, రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్

## ఆటో డ్రైవర్లను ఆదుకోకుంటే అడ్డుకుంటం

- ప్రభుత్వం ఏ వర్గానికి మేలు చేసిందని విజయోత్సవాలు
- ఈ నెల 7న రాష్ట్రవ్యాప్తంగా ఆటోలబంద్.. ఆందోళన
- ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్

కరీంనగర్ తెలంగాణచౌక్, డిసెంబర్ 3 : 'మహాలక్ష్మి స్కీంతో రాష్ట్రంలోని ఆటో డ్రైవర్ల బతుకు ఆగమైంది. కిరాయిలు లేక ఇప్పటివరకు 65 మంది ఆత్మహత్య చేసుకున్నారు. వందలాది కుటుంబాలు రోడ్డునపడ్డాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి. లేదంటే బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపల్లి టూర్‌ను అడ్డుకుంటం' అని తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఏ వర్గానికి మేలు చేసిందని ప్రజాపాలన విజయోత్సవాలు నిర్వహిస్తున్నదని మండిపడ్డారు. కరీం'నగరం'లోని ప్రెస్ భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాస్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు మద్దె రాజేందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి స్కీంతో రాష్ట్ర వ్యాప్తంగా 7లక్షల 50వేల మంది ఆటో డ్రైవర్ల జీవితాలు ఆగమయ్యాయని, రోజువారీగా ₹200 కూడా లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిందని, ఆటో డ్రైవర్లకు ఏడాదికి ₹12వేలు ఇస్తామని నమ్మించి మోసం చేసిందని మండిపడ్డారు. ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలకు కాంగ్రెస్ మేనిఫెస్టో చైర్మన్, మంత్రి శ్రీధర్‌బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బాధ్యత వహించాలని, ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ల కుటుంబాలకు ₹20లక్షలు ఎక్స్‌గ్రేషియా. వెయ్యి కోట్లతో ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు ఈ నెల 7న రాష్ట్ర వ్యాప్తంగా ఆటో బంద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేస్తామని చెప్పారు. ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు.



భీమారం మండలం గోవిందారంలో తహసీల్దార్ రవికిరణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

## కేసీఆర్ చెప్పినట్టు చెరువులు నింపండి

- ఎస్సారెస్పీ పునర్జీవం ద్వారా నీటిని తరలించండి
- సూరమ్మ చెరువుకు కుడి కాలువకు భూ సేకరణ నిలిపేయండి
- గోవిందారం రెవెన్యూ పరిధిలోని రైతుల డిమాండ్
- గ్రామసభ బహిష్కరణ.. తహసీల్దార్‌కు వినతి

మేడిపల్లి, డిసెంబర్ 3 : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పినట్టుగా ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి చెరువులు నింపాలని భీమారం మండలంలోని గోవిందారం, దేశాయిపేట, రాజలింగంపేట రైతులు డిమాండ్ చేశారు. సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ కుడి కాలువ నిర్మాణం కోసం తమ భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. కథలాపూర్ మండలం సూరమ్మ చెరువు ప్రాజెక్ట్ కుడికాలువ నిర్మాణం కోసం గోవిందారం రెవెన్యూ పరిధిలో భూసేకరణకు వారం క్రితం ప్రభుత్వం ప్రాథమిక నోటిఫికేషన్ ఇవ్వగా, మంగళవారం తహసీల్దార్ రవికిరణ్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు సంతకాలు చేయకుండా బహిష్కరించారు. భూ సేకరణను నిలిపేసి, ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, కుడికాలువ భూ సేకరణతో చిన్న, సన్నకారు రైతులకు జీవనాధారమైన భూములు కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సారెస్పీ పునర్జీవ పథకం ద్వారా వరదకాలువను నిండుగా మార్చి చెరువులను నింపుతామని మాజీ సర్పంచ్ కాటిపల్లి శ్రీపాల్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారని, ఆ మేరకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సర్వే చేయించారని గుర్తు చేశారు. కుడి కాలువ భూసేకరణ నిలిపివేసి, కేసీఆర్ సర్కారు చేసిన సర్వే ప్రకారం చెరువులను నింపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు కరండ్ల మధుకర్, నాంచారి స్వప్న, రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ దొంతి శ్రీనివాస్, నాయకులు అన్నాడి జలపతిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి నుంచే హామీ ఇవ్వండి

- పెండింగ్ బిల్లులపై స్పష్టతనివ్వండి
- మాజీ సర్పంచుల జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కరుణాకర్

పెద్దపల్లి టౌన్, డిసెంబర్ 3 : పెద్దపల్లికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి తమ సమస్యలు తెలిపేందుకు అవకాశం ఇవ్వాలని తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్ విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లుల చెల్లింపులపై పెద్దపల్లి నుంచే స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం పెద్దపల్లిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా తాజా మాజీ సర్పంచ్‌లు సమావేశమై తమకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, ఇతర సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ, ప్రతిపక్ష హోదాలో అవాకులు చెవాకులు మాట్లాడిన రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సర్పంచుల బిల్లుల చెల్లింపు విషయాన్ని ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. బిల్లులు చెల్లించే విషయంలో ముఖ్యమంత్రి నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు.

# రెండు లక్షల ఉద్యోగాలు ఎక్కడ?

## ఏం సాధించారని సభ నిర్వహిస్తున్నారంటూ ప్రశ్నిస్తున్న యువత



ఎన్నికలకు ముందు యువత ఓట్లు దండుకునేందుకు హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పేరిట హామీల వర్షం కురిపించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని మరిచిపోయింది. మొత్తం 17కుపైగా హామీలు ఇవ్వడంతోపాటు మేనిఫెస్టోలో పొందుపరిచిన ఆ పార్టీ, ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయింది. కానీ, ఏడాది పాలనను పురస్కరించుకొని బుధవారం పెద్దపల్లిలో నిరుద్యోగ విజయోత్సవ సభను నిర్వహిస్తుండగా.. ఏమి సాధించారని సభ నిర్వహిస్తున్నారో చెప్పాలని యువత ప్రశ్నిస్తున్నది. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సర్కారు తమపై వివక్ష చూపుతున్నదని మండిపడుతున్నది. మరోవైపు సింగరేణి కార్మికులకు సైతం ఇచ్చిన అనేక హామీల అమలుపైనా ప్రభుత్వం దృష్టిపెట్టకపోవడం విమర్శలకు తావిస్తున్నది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి హోదాలో మొదటిసారి పెద్దపల్లి జిల్లాకు వస్తున్న రేవంత్‌రెడ్డి, కార్మికులకు ఏమైనా తీపి కబురు చెబుతారా.. లేదా..? అన్నదానిపై జోరుగా చర్చ జరుగుతున్నది.


- ₹4వేల నిరుద్యోగ భృతి ఏది
- ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్‌కు చర్యలేవి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపుల్లో జాప్యం
- హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పేరిట ఇచ్చిన 17 హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చని కాంగ్రెస్
- అటకెక్కిన ₹5 లక్షల విద్యాభరోసా కార్డు
- యువతులకు అందని ఎలక్ట్రిక్ స్కూటీలు
- సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీల అమలు శూన్యమే
- ఐటీ మినహాయింపు కోసం ప్రయత్నమూ కరువే
- నేడు పెద్దపల్లిలో నిరుద్యోగ వియోజత్సవ సభ
- హాజరవుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

కరీంనగర్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ యువతను ఆకట్టుకునేందుకు యూత్ డిక్లరేషన్ పేరిట హామీల వర్షం కురిపించింది. మొత్తంగా 17కుపైగా హామీలు ఇచ్చి, తాము అధికారంలోకి వస్తే వాటన్నింటినీ అమలు చేస్తామని మభ్యపెట్టింది. మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వోద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించడంతోపాటు అభయహస్తం పేరిట విడుదల చేసిన మేనిఫెస్టోలో పెట్టింది. నిజంగా కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తమకు లాభం చేకూరుతుందని యువత నమ్మి, ఆ మేరకు ఓట్లు వేసింది. కానీ, అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా నేటికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు కాలేదు. ఇప్పుడు ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా.. నిరుద్యోగ విజయోత్సవాన్ని నేడు పెద్దపల్లిలో నిర్వహిస్తున్నది. మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేసిందో చెప్పాల్సిన అవసరం ఏర్పడింది. నిజానికి తాము అధికారంలోకి వచ్చిన తర్వాత 50వేలకుపైగా ఉద్యోగాలు భర్తీ చేశామని చెబుతున్నది. నిజానికి అందులో ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చి నోటిఫికేషన్లు ఎన్ని? గత ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లు ఎన్ని? చెప్పాలన్న డిమాండ్ నిరుద్యోగుల నుంచి వ్యక్తమవుతున్నది. పోనీ కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిన విషయాన్ని నమ్మినా.. పాలకులు చెబుతున్నట్టు భర్తీ చేసింది 50వేలే కదా..? అలాంటప్పుడు 2లక్షల మాట తప్పినట్టే కదా? అన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నేటి సభలో ముఖ్యమంత్రి ఎలా స్పందిస్తారో చూడాలన్నా చర్చ నడుస్తున్నది.

### యూత్ డిక్లరేషన్ అమలేది?



హైదరాబాద్ యూత్ డిక్లరేషన్‌లో భాగంగా.. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ప్రాణాలర్పించిన యువతీ యువకులను ఉద్యమ అమరవీరులుగా గుర్తించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వోద్యోగం ఇవ్వడంతోపాటు తల్లి, తండ్రి, భార్యకు నెలవారీగా ₹25వేల అమరవీరుల గౌరవ పెన్షన్ అందిస్తామని హామీ ఇచ్చింది. ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను ఎత్తివేయడంతోపాటు జూన్ 2న వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇస్తామని చెప్పింది. మెదటి ఏడాదిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ పూర్తి చేస్తామని స్పష్టం చేసింది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే వరకు ప్రతి నెలా ₹4వేల నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించింది. కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు సెంట్రలైజ్డ్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పోర్టల్, ఏడు జోన్లలో ఉపాధి కల్పనా కార్యాయాల ఏర్పాటుతోపాటు ప్రతి జిల్లాలో స్కిల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్లను నెలకొల్పడం, ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రైవేట్ కంపెనీల్లో రాష్ట్ర యువతకు 75 శాతం రిజర్వేషన్ కల్పన, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు యూత్ కమిషన్ ఏర్పాటు చేసి ₹10 లక్షల వరకు వడ్డీలేని రుణ సదుపాయం, ప్రత్యేక గల్ఫ్ విభాగం ఏర్పాటుతో గల్ఫ్ ఏజెంట్ల నియంత్రణ, గల్ఫ్ దేశాల్లో మెరుగైన ఉపాధి కల్పన, గల్ఫ్ కార్మికుల సంక్షేమం.. ఇలా ఎన్నో కార్యక్రమాలు చేపడుతామని ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఈడబ్ల్యూఎస్ వర్గాల విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు పాత బకాయిలు పూర్తిగా చెల్లిస్తామని చెప్పింది. పాలమూరు, తెలంగాణ, మహాత్మాగాంధీ, శాతవాహన యూనివర్సిటీలను ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలుగా మార్చడంతోపాటు ఆదిలాబాద్, ఖమ్మం, మెదక్ జిల్లాల్లో నూతన ఇంటిగ్రేటెడ్ యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తామని, బాసరలోని రాజీవ్‌గాంధీ ట్రిపుల్‌ఐటీ మాదిరిగా నాలుగు నూతన ట్రిపుల్‌ఐటీలను ఏర్పాటు చేసి గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నది. అలాగే అమెరికాలోని ఐఎంజీ అకాడమీ తరహాలో అన్ని వసతులతో కూడిన ప్రపంచ స్థాయి క్రీడా విశ్వ విద్యాలయం ఏర్పాటు చేసి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తామని పేర్కొన్నది. పోలీస్, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లల కోసం వరంగల్, హైదరాబాద్‌లో రెండు విద్యాలయాలను ఏర్పాటు చేస్తామని, 6వ తరగతి నుంచి పట్టభద్రులయ్యే వరకు నాణ్యమైన విద్యను అందిస్తామన్నది. యువ మహిళా సాధికారత కింద 18ఏళ్లు పైబడి చదువుకునే ప్రతి యువతికీ ఎలక్ట్రిక్ స్కూటర్ల అందజేస్తామని, ఆరు గ్యారెంటీల్లో యువ వికాసం కింద విద్యార్థులకు ₹5 లక్షల విద్యా భరోసా కార్డు ఇస్తామని, ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తామని మేనిఫెస్టోలో పెట్టింది. కానీ, అందులో ఏ ఒక్క హామీని అమలు చేయలేదు.



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

## నేడు పెద్దపల్లికి ముఖ్యమంత్రి

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- ఇటీవల గ్రూప్-4, సింగరేణి కొలువులు సాధించిన అభ్యర్థులకు నియామాక పత్రాలు అందజేత

పెద్దపల్లి, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం పెద్దపల్లిలో పర్యటించనున్నారు. కాంగ్రెస్ ఏడాది పాలన సందర్భంగా కలెక్టరేట్ ఎదుట పెద్దకల్వల, రంగంపల్లి శివారులో నిర్వహించే యువ వికాస విజయోత్సవ సభకు హాజరు కానున్నారు. సాయంత్రం 4గంటలకు రంగంపల్లి సబ్ స్టేషన్ వెనుక ఉన్న హెలీప్యాడ్‌లో సీఎం ల్యాండ్ అవుతారు. అక్కడి నుంచి సభా స్థలికి చేరుకొని, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఆ తర్వాత ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారు. అనంతరం వేదికపైకి చేరుకుంటారు. ఇటీవల గ్రూప్-4, సింగరేణి కొలువులు సాధించిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించనున్నారు. అనంతరం సభికులను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. సాయంత్రం 5.50 గంటలకు తిరిగి హైదరాబాద్ వెళ్లిపోనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభా వేదికను సిద్ధం చేశారు. అలాగే సుమారు 2వేల మంది పోలీసులతో భారీ బందోబస్తును నిర్వహిస్తున్నారు. సభ సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, ఉదయం 8 గంటల నుంచి దారి మళ్లింపు చేస్తున్నామని రామగుండం సీపీ శ్రీనివాస్ తెలిపారు. రాత్రి 7గంటల సమయంలో భద్రతా ఏర్పాట్లను మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పరిశీలించారు.

### సింగరేణి హామీలు అటకెక్కినట్టేనా..?



అసెంబ్లీ, సింగరేణి ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీతోపాటు దాని అనుబంధ కార్మిక సంస్థ ఐఎన్‌టీయూసీ అనేక హామీలు ఇచ్చింది. సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను రద్దు చేసేందుకు కృషి చేస్తామని, అలాగే కార్మికులకు విధిస్తున్న అలవెన్సులపై ఆదాయ పన్ను రద్దు చేస్తామని, సొంత ఇంటి పథకం కింద 250 గజాల జాగా ఇప్పించడంతోపాటు ఇల్లు కట్టుకునేందుకు ₹20 లక్షల వడ్డీలేని రుణం ఇస్తామని చెప్పింది. సింగరేణిలో కొత్త బొగ్గు గనులను ప్రారంభించి, రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో కొత్త పరిశ్రమలను తీసుకొచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా హామీల అమలుపై ప్రభుత్వం దృష్టిపెట్టడం లేదు. నిజానికి సింగరేణి సంస్థలో 43వేల మంది కార్మికులు రేయింబవళ్లు రక్తాన్ని చెమటగా మార్చి సంపాదిస్తున్న వేతనాల నుంచి ఏటా ₹800కోట్ల వరకు ఆదాయపన్ను రూపంలో కేంద్రానికి చేరుతున్నాయి. కార్మికులకు ప్రతి నెలా ₹300 కోట్ల వేతనాలు అంటే ఏడాదికి దాదాపు ₹3600 కోట్ల నుంచి ₹4వేల కోట్ల వరకు సంస్థ చెల్లిస్తున్నది. అలాగే మరో ₹వెయ్యి కోట్ల వరకు లాభాల వాటా, బోనస్‌లు అందుతున్నాయి. వీటిపై ఆదాయపన్ను రూపేణా కేంద్ర ప్రభుత్వం శ్లాబుల ప్రకారంగా వసూలు చేస్తున్నది. 10, 20, 30 శాతంగా ఉన్న శ్లాబుల ప్రకారం ఆదాయపన్నును చెల్లించాల్సి రావడంతో ఆ మొత్తం ₹800కోట్ల పైచిలుకుగానే ఉంటుందని సింగరేణి అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. భూగర్భంలోకి వెళ్లి నల్ల బంగారం (బొగ్గు)ను వెలికితీస్తున్న కార్మికులను దేశ సైనికుల మాదిరిగా గుర్తించి, వారికి ఆదాయ పన్నును రద్దు చేయాలని డిమాండ్ ఎన్నో ఏళ్లుగా ఉన్నది. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే 2014లో ఐటీ రద్దు చేయాలని కోరుతూ అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి నాటి కేసీఆర్ ప్రభుత్వం కేంద్రానికి పంపింది. కానీ, కార్మికుల నుంచి వస్తున్న భారీ ఆదాయాన్ని వదులుకోవడానికి ఇష్టపడని కేంద్రం ఆ ఆదాయపన్నును వసూలు చేస్తూనే ఉన్నది. దీని వల్ల కార్మికవర్గంలో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతూనే ఉన్నది. ఒకవైపు ఆదాయపన్ను ద్వారా భారీగా లబ్ధి పొందుతున్న కేంద్రం, ఏటా సింగరేణి సంస్థ ఆర్జించే లాభాలపై ఆదాయ పన్ను రూపేణా దాదాపు ₹400 కోట్ల వరకు లబ్ధి పొందుతున్నట్టు సింగరేణి అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు, ఐటీ మినహాయింపుపై ముఖ్యమంత్రి నేటి సభలో ఏమైనా మాట్లాడుతారా.. లేదా..? అన్న చర్చ ప్రస్తుతం సింగరేణిలో నడుస్తున్నది. వీటితో పాటు ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకునే విధంగా ఏమైనా ఆదేశిస్తారా.. లేదా..? అన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తా

- ట్రస్మా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు
- కరీంనగర్‌లో భారీ బైక్ ర్యాలీ

కమాన్‌చౌరస్తా, డిసెంబర్ 3: వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించి ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే అండగా ఉంటానని, నిరుద్యోగ సమస్యలపై పోరాటం చేస్తానని ట్రస్మా గౌరవాధ్యక్షుడు, ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్ నియోజకవర్గాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్‌రావు పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం శేఖర్‌రావు ఆధ్వర్యంలో వెయ్యి బైకులు, 200 కార్లతో రేకుర్తి వరకు భారీ ర్యాలీ తీశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ బైపాస్ నుంచి ర్యాలీ ప్రారంభించారు. కమాన్ మీదుగా కూరగాయల మార్కెట్ సమీపంలోని అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని, అమరుడు శ్రీకాంతా చారి, కానిస్టేబుల్ కిష్టయ్యకు నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా రేకుర్తికి వెళ్లారు. అక్కడి నుంచి కొండగట్టుకు వెళ్లి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మార్గమధ్యలో గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో మండల ట్రస్మా ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. శేఖర్‌రావును శాలువాలతో సత్కరించారు. ఆయనవెంట కరీంనగర్ ట్రస్మా ఉపాధ్యక్షుడు పచ్చునూరి సురేందర్, నాయకులు లక్ష్మారెడ్డి, రవీందర్, వీరేశం, రంగు శ్రీను, రాజశేఖర్, రాజేశం, బుచ్చిరెడ్డి, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



నినదిస్తున్న ట్రస్మా రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు